క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ జట్టుకు మణికంఠ ఎంపిక



జెర్సీతో పాండవ మణికంఠ, కుటుంబ సభ్యులు

సీతంపేట: ఈ నెల10 నుంచి 12 వరకు జైపూర్‌లో జరగనున్న ఫిట్ ఇండియా ఫుట్‌బాల్ 8వ నేషనల్ పైకా గేమ్స్‌లో రాష్ట్రం నుంచి పాల్గొన్ననున్న జట్టుకు అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌కు చెందిన పాండవ మణికంఠ ఎంపికయ్యాడు. నారాయణ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న మణికంఠ జిల్లా స్థాయిలో కనబర్చిన ప్రతిభతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆయన తండ్రి పాండవ ఈశ్వరరావు తెలిపారు. రైల్వే స్టేడియంలో కోచ్ వి.మధుసూదనరావు వద్ద శిక్షణ పొందుతున్నాడన్నారు.

18న మృత్యుంజయ హోమం



అక్కయ్యపాలెంలోని లలితాపీఠం

సీతంపేట: లలితాపీఠంలో సంకట హర చతుర్థి పురస్కరించుకుని గురువారం గణపతి పంచావరణ అర్చన, గణపతి హోమం నిర్వహించనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ తెలిపారు. 10వ తేదీ సాయంత్రం వారాహి హోమం, 13న ఉదయం 9 గంటలకు చండీ హోమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. మహాశివరాత్రి పురస్కరించుకుని 18వ తేదీ ఉదయం 9 గంటలకు అఘోర గౌరీ మృత్యుంజయ హోమం నిర్వహించనున్నామని, పీఠం కార్యాలయంలో గానీ, 98492 86779 ఫోన్ నంబరులో గానీ సంప్రదించవచ్చని తెలిపారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం



మాట్లాడుతున్న సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వంలో ప్రజల గొంతు ప్రతి ధ్వనిస్తుందన్నారు. సహృదయతే విధానమై, చైతన్యమే నినాదమై నవీన యుగాన్ని తన కవిత్వంలో కవి ఆవిష్కరిస్తాడని తెలిపారు. డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ ప్రముఖ వాగ్గేయకారుడు శ్యామశాస్త్రి గొప్పతనాన్ని, సంగీత విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో వి.ఎస్.ఎన్.మూర్తి, కె.వి.ఎస్.మూర్తి, చిన్న సూర్యనారాయణ, రామతాత, జి.ఎస్.వి.మాణిక్యాలరావు తమ కవితలు చదివి వినిపించారు.

వివాహితపై దాడి

గోపాలపట్నం: వివాహితపై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన సింహాచలంలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలివీ.. సింహాచలానికి చెందిన శంభాన దివ్య గోశాల వద్ద కార్ల లోన్లు ఇచ్చే సంస్థలో పని చేస్తోంది. బుధవారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన కరోతి చంద్రశేఖర్ అడ్డుపడ్డాడు. తనతో వచ్చేయాలని వేధించాడు. అతన్ని తప్పించుకుని వెళ్లేందుకు యతిన్చగా ఆమెపై దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె చేతిపై గాయమైంది. మూడు నెలలుగా ఇదే విధంగా చంద్రశేఖర్ వేధిస్తున్నాడని గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

వినూత్న విధానాలతో మెరుగైన విద్యా వ్యవస్థ



సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, తదితరులు

- వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు
- ఆలయాల ట్రస్ట్ బోర్డుల్లో నాయీ బ్రాహ్మణులకు స్థానంపై హర్షం

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న విధానాల అమలుతో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ మెరుగుపడిందని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు తెలిపారు. జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యా రంగంలో పని తీరుపరంగా రాష్ట్రం దేశంలో 7వ స్థానంలో నిలిచిందన్నారు. టీడీపీ హయంలో 24వ ర్యాంకుతో అధ్వానంగా ఉండేదని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శ్రీకారం చుట్టిన నాడు–నేడు కార్యక్రమం స్ఫూర్తితో దేశ వ్యాప్తంగా 14,500 పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల మధ్య అంతరాన్ని తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.688 కోట్లతో 5,18,740 ట్యాబ్‌లను పంపిణీ చేసిందని వివరించారు. ఉత్తర నియోజకవర్గంలో నాడు–నేడు పథకం కింద 17 పాఠశాలలను రూ.10.54 కోట్లతో అభివృద్ధి చేసినట్టు ఆయన తెలిపారు. అమ్మఒడి పథకంలో 25,804 మందికి రూ.97.20 కోట్లు అందించామన్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలపై పచ్చ పత్రికలు తప్పుడు రాతలు రాస్తున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ బర్కత్ అలీ, కార్పొరేటర్ వి.ప్రసాద్, కో–ఆప్షన్ మెంబర్ సేనాపతి అప్పారావు, ఆళ్ల శ్రీనివాసరావు, డైరెక్టర్లు ఆప్రోజ్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం

ఆలయాల ట్రస్ట్ బోర్డుల నియామకాల్లో నాయీ బ్రాహ్మణుల సామాజిక వర్గం నుంచి ఒకరికి స్థానం కల్పిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంపై గ్రేటర్ విశాఖ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయం ఆవరణలో ముఖ్యమంత్రి జగన్ చిత్ర పటానికి నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, మాజీ కార్పొరేటర్ కె.వెంగళరావు, డైరెకర్లు నూకరాజు, ఆరిపాక పెంటారావు, సుబ్బారావు రాధాకృష్ణ, చిన్నా పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



కంచరపాలెం నేతాజీ వంతెన కూడలిలో ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

కంచరపాలెం: స్థానిక బీఆర్‌టీఎస్ నేతాజీ వంతెన కూడలిలోని ఫుట్‌పాత్‌లపై పలువురు వ్యాపారాలు చేస్తుండడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఊర్వశి కూడలి నుంచి కంచరపాలెం రైతుబజారు, తాటిచెట్లపాలెం వెళ్లే రహదారుల్లోని ఫుట్‌పాత్‌లు దుకాణాలతో ఆక్రమణకు గురయ్యాయి. ఈ సమస్యపై బుధవారం సాక్షి దినపత్రికలో 'ఫుట్‌పాత్‌లపై నడిచేదేలా! అంటూ పబ్లిక్ డిమాండ్ శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. జోన్–5 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఐవీ రమణమూర్తి, కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు ఆదేశాల మేరకు జీవీఎంసీ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు ఆయా ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించారు.

ముగిసిన ఫిల్మ్ ఫెస్టివల్



మాట్లాడుతున్న సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న తెలుగు ఫిల్మ్ ఫెస్టివల్ బుధవారం ముగిసింది. ముగింపు చిత్రంగా 2021లో యు.వేణు దర్శకత్వంలో తెరకెక్కిన విరాట్‌పర్వం చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని సమాంతర సినిమాలు, విదేశీ చిత్రాలు ప్రదర్శించడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. త్వరలో కె.విశ్వనాథ్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. మూడు రోజులు ప్రదర్శించిన చిత్రాలు తిలకించిన వారితో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.చిన్నారావు, డాక్టర్ జి.బాబ్జి, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎం కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు



హాజరు పట్టీని పరిశీలిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: దొండపర్తి డీఆర్‌ఎం కార్యాలయంలోని పలు విభాగాలలో బుధవారం డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయ పనివేళల్లో పలు విభాగాలను సందర్శించి, అక్కడ అందుబాటులో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. కొందరు సమయం మించిపోయినా విధులకు హాజరు కాకపోవడంపై ఆరా తీశారు. సిబ్బంది హాజరు పట్టిని పరిశీలించారు. కొందరు సిబ్బంది భోజన విరామ సమయానికి వెళ్లి ఆలస్యంగా రావడం గుర్తించారు. ఉద్యోగులందరూ విధిగా సమయానికి తమ విధుల్లో ఉండి తీరాలని, అలా చేయని వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని డీఆర్‌ఎం హెచ్చరించారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న విశ్రాంత ఐపీఎస్ అధికారి కోడె దుర్గాప్రసాద్

సీతంపేట: విశ్రాంత ఐపీఎస్ అధికారి, పూర్వ డీజీపీ కోడె దుర్గాప్రసాద్ బుధవారం విశాఖ పౌర గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. విద్యార్థులకు, పాఠకులకు చక్కటి వాతావరణం కల్పించారని పౌర గ్రంథాలయ సొసైటీని అభినందించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో మార్గనిర్దేశం చేశారు. దేశంలో విభిన్న రంగాలలో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవడానికి ప్రతిభ, కృషి అవసరమని చెప్పారు. పరీక్షలకు వెళ్లే ముందు ఎలాంటి ఆందోళన ఉండకూడదని, ప్రశాంతమైన మనస్సుతో పరీక్ష రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.విజయ్‌కుమార్, డి.ఎస్.వర్మ, ఆచార్య ఎ.ప్రసన్నకుమార్, పాలక వర్గం సభ్యులు వి.సీతారామయ్య, సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

'గడప గడపకు' విశేష స్పందన



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం ధర్మానగర్, తిక్కవానిపాలెం సచివాలయాల పరిధిలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలపై ప్రజలకు జియో ట్యాగింగ్‌పై అనుమానాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళ, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, పార్టీ వార్డు అధ్యక్షుడు దుప్పలపూడి శ్రీనివాసరావు, నాయకులు సిద్ధార్థ, గంగా మహేష్, రాజు, కరుణలక్ష్మి, నాగలక్ష్మి, శ్రీకాంత్, దాసు, సచివాలయ, జీవీఎంసీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బ్యాటరీతో పనిచేసే కృత్రిమ చేతుల పంపిణీ



లబ్ధిదారుకు అమర్చిన బ్యాటరీ కృత్రిమ చేతిని పరిశీలిస్తున్న మేయర్ హరివెంకట కుమారి

తాటిచెట్లపాలెం: రోటరీక్లబ్ ఆఫ్ విశాఖపట్నం సెంట్రల్, రోటరీ క్లబ్ ఆఫ్ పూనా డౌన్ టౌన్, కరూర్ వైశ్యాబ్యాంక్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి సహకారంతో ఇనాలి ఫౌండేషన్ రైల్వే న్యూకాలనీలో గల విశాఖ సేఫ్టీ కౌన్సిల్ కార్యాలయంలో బుధవారం ఉచిత బ్యాటరీతో పనిచేసే కృత్రిమ చేతులను పంపిణీ చేసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జీవీఎంసీ మేయర్ జి హరివెంకట కుమారి మాట్లాడుతూ పుట్టుకతో అంగవైకల్యం కలిగిన వారికి, మధ్యలో ప్రమాదాలలో చేతులను కోల్పోయిన వారికి కృత్రిమ చేతులను అందించడం అభినందనీయమన్నారు. సీఎస్‌ఆర్ నిధుల ద్వారా ఇటువంటి బృహత్తర కార్యాక్రమానికి శ్రీకారం చుట్టిన కరూర్ వైశ్యా బ్యాంక్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సి.బాలసతీష్‌ను అభినందించారు. విశాఖ జిల్లా నుంచే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా లబ్ధిదారులను ఎంపిక చేసి ఉచితంగా వారికి ఈ చేతులను అందజేశారు. గురువారం విశాఖపట్నం జిల్లా పరిసర ప్రాతాల వారికి ఈ శిబిరంలో కృత్రిమ చేతులను అమర్చనున్నట్లు బాలసతీష్ తెలిపారు. ఇటువంటి పరికరాన్ని అమర్చేందుకు ఒకొక్కరికి సుమారు రూ.11వేలు ఖర్చు అవుతుందని, దీనికి సిఎస్ఆర్ నిధులతో కరూర్ వైశ్యా బ్యాంక్ సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైజాగ్ జర్నలిస్ట్స్ ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, రోటరీక్లబ్ విశాఖపట్నం సెంట్రల్ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, రోటరీ క్లబ్ పూనా డౌన్ టౌన్ నుంచి అనిల్ చద్దా, ఇనాలి ఫౌండేషన్ క్యాంప్ లీడర్ బి.అనికేత్, ఆంధ్ర మెడికల్ కాలేజ్, రోటరాక్ట్ మెడికోలు, రోటేరియన్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమష్టిగా పరిశుభ్రతకు కృషి

ఏయూ క్యాంపస్: అందరూ సమష్టిగా పరిశుభ్రతకు కృషి చేయాలని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు కోరారు. బుధవారం నరవలోని జామియా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఏయూ సెంటర్ ఫర్ సోషల్ ఎక్స్‌క్లూజన్, ఇంక్లూజివ్ పాలసీ విభాగం నిర్వహించిన 'ఎండింగ్ ఓపెన్ డెఫికేషన్ టువర్డ్స్ ప్రమోటింగ్ హైజీన్ అండ్ పబ్లిక్ హెల్త్'సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించాలన్నారు. కేంద్రం సంచాలకుడు డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతం చేసే దిశగా వర్సిటీ పరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రా మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.నాగేంద్రనాయుడు మాట్లాడుతూ సంప్రదాయ అడ్డుగోడలు తొలగించి పరిశుభ్రత, ఆరోగ్య భద్రత దిశగా అడుగేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్.వరప్రసాద్, శానిటేషన్ సెక్రటరీ డాక్టర్ జి.జగన్నాథరావు, జామియా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కరస్పాండెంట్ షేక్ రహమాన్, డాక్టర్ జి.శాంతారావు, చుక్క క్రిష్టోఫర్, జోసఫ్ రాజు, టి.బుజ్జి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు విస్తృత అవకాశాలు



పాల్గొన్న విద్యార్థులు



ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఆవిష్కరిస్తున్న సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నాగరాణి

- ఉద్యోగాల్లో చేరేందుకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి
- రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి

మురళీనగర్: పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు పారిశ్రామిక, సాంకేతిక రంగంలో విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనరు సి.నాగరాణి తెలిపారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన పలు సౌకర్యాలను ఆమె బుధవారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ జీవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డిప్లమో కోర్సులు పూర్తి కాగానే ఉద్యోగాల్లో చేరడానికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. రెండేళ్ల అనుభవం సాధించిన అనంతరం ఉన్నత చదువులు చదువుకోవచ్చని చెప్పారు. ప్రస్తుతం 17 ఏళ్లకే నెలకు రూ.20 వేలు నుంచి రూ.30వేలు జీతం పొందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇటీవల పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు రూ.6.67లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టాలని, నూతన ఆవిష్కరణలు రూపొందించి పేటెంటు హక్కు పొందేలా విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెక్‌ఫెస్ట్‌లో 833 ప్రాజెక్టులు రాగా.. ఇందులో పేటెంట్ హక్కుల కోసం 13 ప్రాజెక్టులు, ప్రొడక్షన్‌కు 55, ఇంక్యుబేషన్ విభాగానికి 53 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని చెప్పారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలని సూచించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులు స్టూడెంట్ చాప్టర్‌లో తమ పేరు నమోదు చేసుకోవడం ద్వారా కెరీర్‌కు అవసరమైన సహకారం లభిస్తుందన్నారు. ఇందులో వారు పంపించిన ఉత్తమ సృజనాత్మక ఆలోచనలకు పేటెంట్ పొందే అవకాశం ఉందన్నారు. బెస్ట్ ప్రాజెక్టులకు రూ.50 వేలు నగదు బహుమతి లభిస్తుందని తెలిపారు. ముందుగా కాలేజీలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ, ఆధునికీకరించిన కార్యాలయం, ఇన్నోవేషన్ కేంద్రం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభించారు. మెటలర్జీ విభాగానికి దాత సమకూర్చిన ప్రయోగశాల పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఎడ్యుకేషన్ టీపీవో విభాగం డీడీ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పెందుర్తి కాలేజీ ఓఎస్‌డీ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

60 కేజీల గంజాయి స్వాధీనం

మర్రిపాలెం: గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంట్లో గంజాయిని నిల్వ చేసిన ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం కప్పరాడ ప్రాంతం ఇంద్రనగర్‌లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన మహ్మద్ అజ్మిల్‌హక్, సాదికుల్‌ఇస్లాం గుట్టుచప్పుడు కాకుండా 60 కేజీల గంజాయిని ఓ ఇంట్లో ఉంచారు. ఈ మేరకు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 60 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితులను కంచరపాలెం పోలీసులకు అప్పగించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మురళీనగర్: మర్రిపాలెం విద్యుత్ సెక్షన్ రైల్వే క్వార్టర్స్ 11 కేవీ ఫీడరు పరిధిలో నిర్వహణ పనుల కారణంగా పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్ -2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రైల్వే క్వార్టర్స్, మర్రిపాలెం మెయిన్ రోడ్డు, గవర వీధి, గొల్ల వీధి, రాణాప్రతాప్‌నగర్, శ్రీనివాసనగర్, హంస్సేన్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంట ల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 06081001100 6691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలను 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

'ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి'



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

సీతమ్మధార : ఫీజుల పేరుతో విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేసి ఆత్మహత్యలు చేసుకునే విధంగా ప్రేరేపిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఫణేంద్రకుమార్ మాట్లాడుతూ అనంత పురం జిల్లాలో చదువుతున్న భవ్యశ్రీ అనే విద్యార్థినిని అక్కడి కళాశాల యాజమాన్యం ఫీజు కట్టాలని.. లేకపోతే రికార్డులు ఇవ్వబోమని భయభ్రాంతులకు గురి చేయడంతో కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిందని అన్నారు. అలాగే విశాఖలో నాలుగో వార్డులోని రెసిడెన్షియల్ హాస్టల్లో అమ్మాయి చనిపోయిందన్నారు. వీటిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని.. తక్షణమే ఆయా కళాశాలలను సీజ్ చేయాలన్నారు.

రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ సిబ్బంది సోదాలు



రైలులో తనిఖీలు చేస్తున్న జీఆర్పీ సిబ్బంది



పార్సిల్ కార్యాలయం వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు నేతృత్వంలో సబ్ ఇన్‌స్పెక్టర్ టి.కామేశ్వరరావు, సిబ్బంది ఈ తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్, వివిధ ప్లాట్‌ఫాంలు, వెయిటింగ్ హాల్స్, పార్సిల్ కార్యాలయాలు, వివిధ రైళ్లలో తనిఖీలు చేపట్టారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈ తనిఖీలు ముఖ్య ఉద్దేశమని సీఐ తెలిపారు.

మహిళలకు ఉచితంగా 'రైటర్ పద్మభూషణ్' చిత్ర ప్రదర్శన



రైల్వేన్యూకాలనీ శ్రీకన్య థియేటర్ వద్ద క్యూలో ఉన్న మహిళలు

తాటిచెట్లపాలెం: రైటర్ పద్మభూషణ్ చిత్రాన్ని బుధవారం ఎంపిక చేసిన పలు థియేటర్లలో మహిళల కోసం ఉచిత ప్రదర్శన వేశారు. దీనిలో భాగంగా రైల్వే న్యూకాలనీలోని శ్రీకన్య థియేటర్‌లో ప్రదర్శించిన నాలుగు షోలకు మహిళలకు ఉచిత ప్రవేశం కల్పించారు. ఓ లైబ్రరీలో పనిచేసే మధ్య తరగతి యువకుడు ఎలా రచయిత అయ్యాడనే కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 3వ తేదీన విడుదలైంది.

రోడ్డు ప్రమాదంలో కొరియర్ బాయ్‌కు గాయాలు



క్షతగాత్రుడు కిరణ్

మర్రిపాలెం: రోడ్డు ప్రమాదంలో కొరియర్ బాయ్‌కు తీవ్ర గాయాలైన ఘటన బుధవారం కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మురళీనగర్‌లోని తెన్నేటినగర్ వద్ద టాటా ఏస్ వ్యాన్ సందులోంచి మలుపు తిరుగుతున్న క్రమంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మర్రిపాలేనికి చెందిన బల్లా కిరణ్(19) అనే యువకుడిని ఢీకొంది. దీంతో ఆయన ఎడమ కాలు విరిగిపోయింది. ఈయన అమెజాన్‌లో డెలివరీ బాయ్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయం 9.30 గంటలకు ఈ ప్రాంతంలో వినియోగదారులకు వస్తువులు డెలివరీ చేయడానికి వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. కిరణ్ తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.